వార్డు కార్యాలయం మార్పుతో తిప్పలు!

- మోతీనగర్ వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్న వృద్ధులు, మహిళలు
- కంప్యూటర్ ఏర్పాటు చేసి ఆన్‌లైన్ నమోదు మూసాపేటలోనే చేయాలని స్థానికుల డిమాండ్


మూసాపేట వార్డు కార్యాలయ భవనం

మూసాపేట: వార్డు కార్యాలయం మోతీనగర్‌కు మార్చడంతో అక్కడికి వెళ్లి సంక్షేమ పథకాల దరఖాస్తులు చేసుకోవాలంటే వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. మూసాపేట ప్రజలకు కొత్త ప్రాంతం కావటంతో అక్కడికి వెళ్లినా వార్డు కార్యాలయాన్ని వెతుక్కోవాల్సిన పరిస్థితి. ఎన్నో సంవత్సరాలుగా మూసాపేటలోని వార్డు కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నామని, ఇప్పుడు మోతీనగర్‌కు వెళ్లాలంటే ఎలా వెళ్లాలంటూ స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మోతీనగర్‌లోనే దరఖాస్తుల నమోదు

మూసాపేట డివిజన్ పరిపాలనా భవనం మోతీనగర్‌కు మార్చటంతో ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలకు దరఖాస్తులు అక్కడి నుంచే తీసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లు, కరెంటు బిల్లులు, గ్యాస్ వంటి పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు మోతీనగర్‌లోని వార్డు కార్యాలయంలోనే అధికారులు, ఆపరేటర్లు అందుబాటులో ఉంటారు. అక్కడ దరఖాస్తు స్వీకరించి వెంటనే ఆన్‌లైన్‌లో ఆపరేటర్లు నమోదు చేస్తున్నారు. అయితే మూసాపేటలో కూడా వార్డు కార్యాలయం ఉండటంతో మూసాపేట పరిసర ప్రాంత ప్రజలు ఎక్కువగా మూసాపేట వార్డు కార్యాలయానికే వచ్చి దరఖాస్తు చేసేందుకు వస్తున్నారు. వార్డు కార్యాలయం మారడంతో మూసాపేట ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మోతీనగర్ వార్డు కార్యాలయానికి వెళ్లాలన్నా మూసాపేట నుంచి బస్సు ఎక్కి ఎర్రగడ్డలో దిగి, అక్కడి నుంచి మళ్లీ బోరబండ బస్సు ఎక్కి మోతీనగర్‌లో దిగాలి. అనంతరం వార్డు కార్యాలయానికి చేరుకోవాల్సిన పరిస్థితి ఉంది. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు రెండు బస్సులు మారాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఒకవేళ వెళ్లినా తమ పనులకు సెలవు తీసుకొని వెళ్లాల్సి వస్తుంది. ఒకవేళ అక్కడ ఎక్కువమంది దరఖాస్తుదారులు ఉంటే మరో రోజు వెళ్లాల్సి వస్తుంది. ఇలా తమ ఇబ్బందిని గుర్తించి అధికారులు, ప్రజా ప్రతినిధులు మూసాపేటలోని వార్డు కార్యాలయంలోనే దరఖాస్తులు తీసుకొని ఇక్కడే నమోదు చేయాలని కోరుతున్నారు.

2 గంటల వరకే దరఖాస్తుల స్వీకరణ

అధికారులు ఇప్పటికే సోమ, మంగళ, శనివారం మోతీనగర్ కార్యాలయంలో, బుధ, గురు, శుక్రవారం మూసాపేటలోని వార్డు కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కానీ మధ్యాహ్నం 2 గంటల వరకే దరఖాస్తులు స్వీకరిస్తున్నారని, మూసాపేటలో దరఖాస్తులు స్వీకరించినా కంప్యూటర్ ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవటంతో మళ్లీ ఏ సమస్య ఉన్నా దరఖాస్తుదారులు మోతీనగర్‌కే వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. మూసాపేట వార్డు కార్యాలయంలో కూడా ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని అందుకు తగ్గ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

> **మోతీనగర్ వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది**
>
> 
>
> గతంలో మూసాపేట వార్డు కార్యాలయంలోనే దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మోతీనగర్ వార్డు కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చింది. ఒక్కదానినే వెళ్లలేక నా కూతురును తీసుకొని ఆటోలో వెళ్లి వచ్చాం. ప్రతి సంక్షేమ పథకానికి మోతీనగర్‌కు వెళ్లడానికి మాకు ఇబ్బందిగా ఉంది. అక్కడికి వెళ్లాక పని పూర్తికాకుంటే మరుసటి రోజు మళ్లీ వెళ్లాల్సి వస్తుంది.
>
> – జాజుల కవిత, మూసాపేట



బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన లంకల దీపక్ రెడ్డిని ఆదివారం మూసాపేట బీజేపీ సీనియర్ నాయకులు శైలేష్ కుమార్ కలిసి సన్మానించారు. భవిష్యత్‌లో పార్టీ బలోపేతానికి అందరం కలిసి కృషి చేద్దామని, రానున్న ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలన్నారని తెలిపారు.

– మూసాపేట

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీ వినాయక పార్కులో బీజేపీ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్. వంశీరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సుమన హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనుభవజ్ఞులైన వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు.

సంక్షేమ సంఘాల అధ్యక్షుల ఎన్నిక


మద్దతుదారులతో న్యూ రామారావు నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాంరెడ్డి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ న్యూ రామారావు నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రాంరెడ్డి విజయం సాధించారు. ఆదివారం కమిటీ హాల్‌లో ఎన్నికల అధికారి పోతురాజు నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అదే విధంగా మూసాపేట డివిజన్ కబీర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా జోసెఫ్ కిరీటన్ విజయం సాధించారు.

ముగిసిన సాయిబాబా ఆలయ వేడుకలు


వ్రతంలో పాల్గొన్న భక్తులు

మోతీనగర్: సద్గురు సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వేడుకల్లో భాగంగా రెండవ రోజు కాగడ హారతి, శతకటాభిషేకం, అలంకరణ, అర్చన, సామూహిక శ్రీ సత్యదేవుని వ్రతం, మధ్యాహ్నం హారతి, అన్న సమారాధన, సంధ్యా హారతి, విష్ణు సహస్రనామ పారాయణం, భజన, పల్లకీ సేవ తదితర పూజలు నిర్వహించారు.

రాందేవ్‌రావ్ హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రేఖి థెరపీ గ్రాండ్ మాస్టర్ లక్ష్మీ కమలాకర్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: రాందేవ్‌రావ్ హాస్పిటల్‌లో మెడ, వెన్ను నొప్పి, స్పైన్‌కు సంబంధించిన మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. వైద్య శిబిరంలో సుమారు 400 మంది మెడ, వెన్ను నొప్పి సమస్యలతో బాధపడుతున్న వారికి ఎంఆర్ఐ, సీటీ, ఇతర పరీక్షలు ఉచితంగా చేశారు. క్యాంపును ప్రముఖ రేఖి థెరపీ గ్రాండ్ మాస్టర్ లక్ష్మీ కమలాకర్ ప్రారంభించారు. రాందేవ్‌రావ్ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కే. కమలాకర్ ఆధ్వర్యంలో క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ హిమాన్షు ఆర్ ప్రసాద్ వెన్నుపూస సమస్యలతో బాధపడుతున్న రోగులకు చికిత్స, వైద్య సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్ సుంకర, డాక్టర్ పవన్, డాక్టర్ మనికుమార్, డాక్టర్ జుబేర్, డాక్టర్ సత్యనారాయణ, భవానంద్, విక్రమ్‌దేవ్‌రావు, మీరారావ్, అపర్ణ రావ్, ప్రశాంత్‌రెడ్డి, అడ్మిన్ మేనేజర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి గురుదత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో త్రిమూర్తి స్వరూప గురుదత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ నాగిరెడ్డి తెలిపారు. ఈ నెల 14న సాయంత్రం గణపతి పూజ, యాగశాల ప్రవేశం, అఖండదీప స్థాపన, గణపతి హోమం, దత్తాత్రేయ స్వామి మూలమంత్ర హోమం, 15న మండప దేవత హోమం, పూజలు, యంత్రస్థాపన, ఉదయం 8.40 గంటలకు స్వామి విగ్రహ ప్రతిష్ఠ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

న్యాక్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మాదాపూర్: మాదాపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ హైదరాబాద్ నిరుద్యోగ యువతకు పలు కోర్సుల్లో నాణ్యమైన శిక్షణతో 100శాతం ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది. ఆసక్తి గల అభ్యర్థులు సినిమాటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, యాంకరింగ్, డబ్బింగ్, వాయిస్ ఓవర్ స్కిల్స్ కోర్సుల కొరకు 900149225, లాండ్ స్కేప్ డిజైన్ , ఇంటీరియర్ డిజైన్ కోర్సు కొరకు 9063208703, స్టోర్ కీపర్ కోర్సులకు 9676706414, యంఈపీ, ఫినిషింగ్ స్కూల్ కోర్సు నిమిత్తం 7097114947 ఫోన్ నెంబర్‌లలో సంప్రదించి రిజిస్టర్ చేసుకోగలరు. ఈనెల మూడవ వారంలో తరగతులు ప్రారంభంకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఆలయ 124వ వార్షిక వేడుకలు



నిజాంపేట్ : నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ఏనుగుల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భ్రమరాంబ మల్లికార్జున రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ 124వ వార్షిక వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. వేడుకలకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి, మాజీ మేయర్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్లు బొర్రా దేవి చందు, పెద్దిరెడ్డి సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఏనుగుల అభిషేక్‌రెడ్డి, చంద్రగిరి జ్యోతి సతీష్, నాయకులు శివారెడ్డి, దశరథ, ముత్యాలు, స్వామి, ఏనుగుల రాజశేఖర్‌రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

- పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ


పీఏసీ చైర్మన్ గాంధీతో కాలనీ అధ్యక్షుడు తదితరులు

ఆల్విన్‌కాలనీ: కాలనీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఊట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గాంధీని ఆయన నివాసంలో కాలనీ వాసులు కలిశారు. అధ్యక్షుడిని ఎమ్మెల్యే సన్మానించి మాట్లాడారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాపిరెడ్డినగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ విజేతలకు సన్మానం


మార్షల్ ఆర్ట్స్‌లో మెడల్స్ సాధించిన విజేతలను సన్మానిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఏఎస్‌రాజు నగర్‌లో ఉన్న ట్రైయిన్ యువర్ సెల్ఫ్ మార్షియల్ ఆర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థులు సత్తా చాటారు. ఢిల్లీ, నేపాల్, సౌత్ ఆఫ్రికా తదితర దేశాల్లో జరిగిన పోటీల్లో గోల్డ్, బ్రాంచ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. వారిని ఆదివారం హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు సన్మానించారు. కోచ్ నవీన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సౌత్ ఆఫ్రికా దర్బన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ కరాటేలో ఇండియా తరఫున 30 కేజీల విభాగంలో బిశరి సిల్వర్, 35 కేజీల విభాగంలో భార్గవ్, 45 కేజీల విభాగంలో సాయి సహస్రద్ బ్రాంజ్ మెడల్‌ను గెలిచారన్నారు. అదే విధంగా నేపాల్, ఖాట్మండ్‌లో సీనియర్ ఈవెంట్ ఆర్గనైజేషన్‌లో భార్గవ్ బ్రాంజ్ మెడల్ గెలవటం సంతోషంగా ఉందన్నారు.

చెత్తకు నిప్పు.. ఎగిసిపడ్డ మంటలు


కేపీహెచ్‌బీ 5వ ఫేజ్ నుంచి 4వ ఫేజ్‌కు వెళ్లే దారిలో దట్టమైన పొగ, ఎగిసిపడిన మంటలు

కేపీహెచ్‌బీకాలనీ: రోడ్డు పక్కన ఉన్న చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కేపీహెచ్‌బీకాలనీ ఐదవ ఫేజ్ నుంచి నాలుగవ ఫేజుకు వెళ్లే దారిలో ఆదివారం సాయంత్రం రోడ్డు పక్కన పేరుకు పోయిన చెత్తా చెదారం, ఎండు కొమ్మలు వంటి వాటికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో మంటలు వ్యాపించి అగ్ని ప్రమాదం జరిగిందని స్థానికులు ఆందోళన చెందారు. అటుగా పోయే వాహనదారులు సైతం మంటలను చూసి భయంతో ఆగిపోయారు. మంటలు ఎగిసిపడటానికి అక్కడే ఉన్న కేబుల్ తవ్వకాలలో వినియోగించే కొన్ని పైపులు కూడా కారణమని తెలుస్తోంది. పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేసిన వ్యక్తులే నిప్పు పెట్టి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. కొద్దిసేపటికి మంటలు అదుపులోకి రావటంతో వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగించాయి.

ట్వింకిల్ స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న దుర్గేష్, దుర్గాదేవి, గోపి యాదవ్

కూకట్‌పల్లి: సమాజ సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించటం అభినందనీయమని ఓమ్ని వైద్యశాల సీఈఓ దుర్గేష్ అన్నారు. ఆదివారం కేపీహెచ్‌బీకాలనీ మొదటి రోడ్డులోని ట్వింకిల్ స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ దుర్గాదేవి, మేనేజింగ్ డైరెక్టర్ గోపి యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో రోగులకు రక్తదాన శిబిరాల ద్వారా అందించిన రక్తం ఎంతో అవసరం అవుతుందన్నారు. అలాంటి రక్తాన్ని ఉచితంగా అందించిన యువకులను అభినందించారు. 80 మందికి పైగా యువకులు, మహిళలు రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన


ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు

కూకట్‌పల్లి: చిమ్మపూడి శ్రీరామమూర్తి దర్శకత్వంలో భామినీ భువన విజయం చిత్రప్రదర్శన ఆకట్టుకుంది. సాధన సాహితీ స్రవంతి 43వ వార్షికోత్సవం సందర్భంగా చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం భారత్ వికాస్ పరిషత్ సత్సంగ్ హాల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షులుగా వివేకానంద సేవా సమితి అధ్యక్షులు సిహెచ్. హనుమంతరావు, సత్కారం అశ్వినీ సుబ్బారావు, ఆత్మీయ అతిథులుగా ప్రముఖ సాహితీవేత్త డా. ఎస్. అనంతలక్ష్మి, అభినవ తెనాలి రామకృష్ణ మావుడూరు సూర్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు


హోమంలో పాల్గొన్న భక్తులు

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్‌లో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి పూజలు, హోమాలు, జపాలు, పారాయణాలు కొనసాగాయి. ఉదయం 10.30 గంటలకు యజ్ఞం, 11.30 గంటలకు విగ్రహాలకు ధాన్యాధివాసం, మధ్యాహ్నం 1 గంటకు హారతి, మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమం, సాయంత్రం 7.30 గంటలకు శయ్యాధివాసం, ధనాధివాసం , పుష్ప, ఫల, వస్త్రాధివాసాలు, హారతి మంత్ర పుష్పం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం పలు పూజలతో పాటు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ, బాలాజీనగర్ ఆర్య వైశ్య బస్తీ సంఘం నాయకులు కోరారు.

మాస్టర్ మైండ్ స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని మాస్టర్ మైండ్ స్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మాస్టర్ మైండ్ స్కూల్ చైర్మన్ రాజు సంగాని, డైరెక్టర్ నాగరాజు, ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో వెన్నెల ఆసుపత్రి సౌజన్యంతో వైద్య శిబిరం కొనసాగింది. బీపీ, షుగర్, థైరాయిడ్, ఇతర పరీక్షలను నిర్వహించి మందులు అందజేశారు. ఆసుపత్రి వైద్యులు కల్యాణ్, రీనా, సౌమ్య ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు.

దాతకు సన్మానం



మూసాపేట: మూసాపేట చిత్తారమ్మ ఆలయం వద్ద ముష్కిపేట, జనతానగర్, చిత్తారమ్మ నగర్ వినాయక ఉత్సవ కమిటీకి శాశ్వతంగా షెడ్డును నిర్మించిన దాత రామారం శ్రీశైలం గౌడ్‌ను ఆదివారం ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు, ఉత్సవ కమిటీ సభ్యులు జిల్లా గోపాల్, కొడిచర్ల ఎల్లేష్, బాబూరావు, శ్రీను, మల్లేష్, అంజిగౌడ్, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

రంగనాథుడికి ప్రత్యేక అభిషేకం

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని రంగనాథస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, అర్చనలు, పూజలు, అలంకారం చేసిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం బాలభోగం, అర్చన, బలిహరణ, ఆరాధన, సామూహిక విష్ణు సహస్రనామపారాయణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో స్వామివారికి ప్రత్యేక పల్లకీసేవ, వాహనసేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

నేడు రథోత్సవం

రంగనాథుడి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన రథోత్సవం సోమవారం జరుగనుంది. ఈ సందర్భంగా ఆలయ రథాన్ని అందంగా తీర్చిదిద్దారు. సోమవారం సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రంగనాథుడి సేవలో పద్మభూషణ్ స్వప్నసుందరి

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని రంగనాథ స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవ వేడుకల్లో ఆదివారం ప్రముఖ నృత్యకారిణి, పద్మభూషణ్ స్వప్నసుందరి పాల్గొన్నారు. ఎన్నో రంగనాథుడి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరవుతున్న ఆమె ఆలయ ప్రాంగణంలో నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం స్వామివారి వాహనసేవలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆమె స్వామివారిని, మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



వైభవంగా కట్టమైసమ్మ జాతర

- పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు
- బోనాలు సమర్పించి మొక్కుల చెల్లింపు
- హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

సుభాష్‌నగర్: సూరారంలోని కట్ట మైసమ్మ రేణుకా ఎల్లమ్మ ప్రధాన జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ జాతరకు స్థానికంగానే కాకుండా చుట్టు పక్కల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మహిళలు కుటుంబ సమేతంగా బోనాలతో తరలివచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. సూరారంలోని ప్రతి ఇంట్లో బంధువులు రాకతో సందడి నెలకొంది. కార్యక్రమానికి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమంతరెడ్డి, బీజేపీ నేత మల్లారెడ్డి, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, రావుల శేషగిరి, సురేష్ రెడ్డి, విజయ శేఖర్ గౌడ్ లు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

